- కలగానే పీఏబీఆర్‌లో పూర్తిస్థాయి నీటి నిల్వ
- టీబీ డ్యాం నీరు వదిలితే.. హెచ్చెల్సీకి గండ్లు
- మరమ్మతులకు నిధులివ్వని జగన్ సర్కారు
- హెచ్ఎల్ఎంసీ ఆధునికీకరణ ప్రతిపాదనకే పరిమితం
- కొత్త ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న రైతులు



శిథిలావస్థకు చేరిన హెచ్ఎల్ఎంసీ

5 ఏళ్లు నిర్లక్ష్యం చేసిన వైసీపీ ప్రభుత్వం



నీటి వనరు కన్నీరు!

ఉమ్మడి జిల్లాకు ప్రధాన నీటివనరు తుంగభద్ర ఎగువ కాలవ. దీని నిర్వహణను వైసీపీ హయాంలో గాలికి వదిలేశారు. మరమ్మతు పనులను కూడా పైసా ఇవ్వలేదు. సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశాల్లో మాత్రం ప్రగల్భాలు పలికారు. జిల్లాలోనే అతిపెద్ద రిజర్వాయర్ అయిన పీఏబీఆర్ హెచ్చెల్సీ పరిధిలోనే ఉంది. దీని సామర్థ్యం 11 టీఎంసీలు. కానీ ఎన్నడూ పూర్తిస్థాయిలో నిల్వ చేయలేదు. కారణం.. నిర్వహణా లోపం. ఎంపీఆర్ డ్యాందీ అదే పరిస్థితి. హెచ్ఎల్ఎంసీ ఆధునికీకరణను కూడా పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. హెచ్చెల్సీ లింక్ చానల్‌కు సంబంధించిన కాలవలను పటిష్టపరిచి, సామర్థ్యం పెంచాల్సి ఉన్నా.. పట్టించుకోలేదు. హై లెవెల్ మెయిన్ కెనాల్ (హెచ్ఎల్ఎంసీ) 189 కి.మీ. మోపిడి వద్ద పీఏబీఆర్‌కు 11 కి.మీ. మేర లింక్ చానల్ శిథిలావస్థకు చేరింది. దీన్ని పూర్తిస్థాయిలో సరిచేసేందుకు రూ.74 కోట్లు అవసరమని ఇంజనీరింగ్ అధికారులు అంచనా వేశారు. నాలుగేళ్లుగా హెచ్చెల్సీ అధికారులు వైసీపీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. వాటిని చెత్తబుట్టలో పడేస్తూవచ్చారు. ఈ లింక్ చానల్ పూర్తి కాకపోతే సాగునీటితో పాటు అనంతపురం నగరానికి తాగునీటికి సైతం కష్టాలు తప్పవని ఇంజనీర్లు చెబుతున్నారు. హెచ్చెల్సీ శిథిలావస్థకు చేరిన కారణంగా టీబీ డ్యాం నుంచి నీటిని వదిలిన ప్రతిసారీ గండ్లు పడుతున్నాయి. నీరు వృథా అవుతోంది. - అనంతపురం క్లాక్‌టవర్

సొంతానికి సోకులు

హెచ్చెల్సీకి జిల్లా కేంద్రంలో కార్యాలయమే లేదు. అయినా వైసీపీ హయాంలో ఏ ఒక్క ప్రజాప్రతినిధీ పట్టించుకోలేదు. కానీ తమ పార్టీ జిల్లా కార్యాలయానికి మాత్రం హెచ్చెల్సీ స్థలం రెండు ఎకరాలను కేటాయించుకున్నారు. నిర్మాణ పనులను వేగంగా కొనసాగించారు. అదే హెచ్చెల్సీ స్థలంలో జలవనరుల శాఖ సీఈ, ఎస్ఈ కార్యాలయాలకు స్థలం కేటాయించినా.. ఒక్క అడుగూ ముందుకుపడలేదు. సుమారు 20 ఎకరాలకు పైగా సొంత స్థలం ఉన్నా.. కార్యాలయ భవనం నిర్మించుకోలేని దుస్థితిలో హెచ్చెల్సీ శాఖ ఉంది. తెలుగుతల్లి కూడలిలో ఉన్న హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయాన్ని రెండున్నరేళ్ల క్రితం ఖాళీ చేయించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి విస్తరణ కోసం దీన్ని స్వాధీనం చేసుకున్నారు. దీంతో హెచ్చెల్సీ కాలనీలో ఎస్ఈ కార్యాలయాన్ని ఒక చోట, డిప్యూటీ ఎస్ఈ ఒక చోట కేటాయించారు. సిబ్బంది, రికార్డుల కోసం ఒక గదిని కేటాయించారు. జలవనరుల శాఖ సీఈ కార్యాలయ భవనాన్ని నిర్మించాలని రెండెకరాల విస్తీర్ణంలో ప్రహరీ ఏర్పాటు చేశారు. ఆ తరువాత ఒక్క అడుగూ ముందుకు పడలేదు.



వర్షపు నీటికే గండిపడిన హెచ్చెల్సీ



కాలువ సైడ్‌వాల్ దుస్థితి

రద్దు చేసి.. వదిలేశారు..

హెచ్చెల్సీ ఆధునికీకరణపై నీలినీడలు కమ్ముకున్నాయి. 2008-09లో రూ.458 కోట్లతో హెచ్ఎల్ఎంసీ ఆధునికీకరణ పనులను ప్రారంభించారు. 2018 వరకు రూ.310 కోట్ల పనులు జరిగాయి. మిగిలిన రూ.148 కోట్ల పనులను వైసీపీ ప్రభుత్వం ఏర్పడగానే రద్దు చేశారు. ఆ పనులను కొనసాగించి ఉంటే ఇప్పటికి పూర్తి అయ్యేవి. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రూ.148 కోట్లతో పూర్తి కావాల్సిన పనులు కాస్తా రూ.500 కోట్లకు చేరాయని హెచ్చెల్సీ అధికారులు, ఇంజనీర్లు, నిపుణులు అంటున్నారు. ఆధునికీకరణ పనులు పూర్తి చేస్తే 2600 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న కాలవను 4200 క్యూసెక్కులకు పెంచుకోవచ్చు. దీంతో టీబీ డ్యాంలో వరద నీటిని అదనంగా జిల్లాకు తీసుకునే వెసులుబాటు ఉంటుంది.

నీటిని నిల్వ చేసేదెన్నడు..?

జిల్లాలో అతిపెద్ద రిజర్వాయరు.. పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్. దీని నీటి నిల్వ సామర్థ్యం 11 టీఎంసీలు. కానీ ఇప్పటి ఆ స్థాయిలో ఎప్పుడూ నీటిని నిల్వ చేయలేదు. పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయాలంటే మిగిలిన భూసేకరణ చేపట్టాలి. ఆ మేరకు నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. పీఏబీఆర్ నీటి నిల్వ సామర్థ్యం అంచనా వేసేందుకు రూ.5కోట్లు అవసరమని సీడబ్ల్యూసీ పూణెకు చెందిన కంపెనీ తెలిపింది. 11 టీఎంసీల నీటిని నిల్వ చేయడానికి మరో రూ.450 కోట్లు అవసరం. వైసీపీ ప్రభుత్వం వీటి గురించి పట్టించుకోలేదు. వరద నీటిని నిల్వ ఉంచేందుకు ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణ డీపీఆర్‌కు రూ.4.8కోట్లు అవసరం. దీన్ని కూడా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ వచ్చింది. ఇలా అడుగడుగునా హెచ్చెల్సీని నిర్వీర్యం చేసింది.

పీఏబీఆర్ సామర్థ్యం పెంచాలి..



పీఏబీఆర్ గరిష్ట సామర్థ్యం మేరకు నీటిని నింపాలి. పీఏబీఆర్ కింద మాకు మూడెకరాల ఆయకట్టు ఉంది. నీరు తక్కువగా ఉండడంతో వరి, ఇతర పంటలు వేయనీయడం లేదు. ఆరుతడి పంటలే పెట్టమంటున్నారు. నీటి నిల్వలు పూర్తిస్థాయిలో ఉండే పంటలు బాగా పండిచి అభివృద్ధి చెందుతాం. కానీ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కొత్త ప్రభుత్వం పీఏబీఆర్‌పై దృష్టి సారించాలి. డ్యాంను పటిష్టపరచాలని రైతుల తరఫున కోరుతున్నాం. హెచ్చెల్సీ అధికారులను, కలెక్టర్లను ఐదేళ్లలో పలుమార్లు కలిశాం. ఎటువంటి ఉపయోగం లేదు.

- కురుబ సంగప్ప, రైతు, జల్లిపల్లి

స్పందన లేదు



హెచ్చెల్సీ పరిధిలోని పనులకు ప్రతిపాదనలు పంపినా స్పందన రావడం లేదు. గడిచిన ఐదేళ్లలో హెచ్చెల్సీ ఆధునికీకరణ, పీఏబీఆర్ పటిష్టత, మోపిడి వద్ద ఉన్న లింక్‌చానల్, ఇతర మరమ్మతులు, వివిధ నిర్మాణాలకు నాలుగు దఫాలుగా జలవనరుల శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాము. ఒక్క ప్రతిపాదనకూ స్పందన రాలేదు. హెచ్చెల్సీ మరమ్మతులు, పహారాకు అవసరమైన నిధుల కోసం ఎన్నోసార్లు అడిగినా పట్టించుకోలేదు. పూర్తిస్థాయిలో నిధులు ఇస్తే కాలవ పటిష్టత, రిజర్వాయర్ల సామర్థ్యం పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. టీబీ డ్యాం నుంచి వచ్చే నీటిని పూర్తి స్థాయిలో నిల్వ చేసుకుని సద్వినియోగం చేసుకుంటే జిల్లా సస్యశ్యామలం అవుతుంది. - రాజశేఖర్, హెచ్చెల్సీ ఎస్ఈ

పింఛన్లకు రూ.195 కోట్లు

రేపు బ్యాంకుల నుంచి డ్రా: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం క్లాక్ టవర్/టౌన్, జూన్ 27: పెంచిన పింఛన్ల పంపిణీకి జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. పింఛన్లకు కేటాయించిన సొమ్మును శనివారం బ్యాంకుల నుంచి డ్రా చేస్తామని తెలిపారు. సీఎస్ నీరబ్ కుమార్ పింఛన్ల పంపిణీపై గురువారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాలో 2,87,032 మంది లబ్ధిదారులకు జూలై నెలలో పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.195.70 కోట్లు నిధులను మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో పెంచిన పింఛన్ సొమ్ము ఒక నెలకు సంబంధించి రూ.125.82 కోట్లు, హామీ మేరకు ఏప్రిల్ నుంచి చెల్లించాల్సిన నెలకు రూ.వెయ్యి వంతున బకాయిలు రూ.69.88 కోట్లు ఉన్నాయి. అధికారంలోకి వస్తే పింఛన్ సొమ్మును రూ.3000 నుంచి రూ.4000కు పెంచుతామని, ఏప్రిల్ నుంచే పెంపును వర్తింపజేస్తామని ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారు. లబ్ధిదారుల హౌస్ హోల్డ్ మ్యాపింగ్ ప్రక్రియను చేపట్టామని, శుక్రవారానికి పూర్తవుతుందని సీఎస్‌కు కలెక్టర్ తెలిపారు. ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీని ప్రారంభిస్తామని, పింఛన్ అందజేసిన తరువాత అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకుంటామని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని అన్నారు. పింఛన్ల పంపిణీ సమయంలో మండల స్థాయి అధికారులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

ఇళ్ల వద్దకే..

పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దే పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ ఈశ్వరయ్య తెలిపారు. గుంతకల్లు నియోజకవర్గంలో 16,357 మంది, అనంతపురం అర్బన్‌లో 23,373 మంది, కళ్యాణదుర్గంలో 37,666 మంది, రాప్తాడులో 30,014 మంది, రాయదుర్గంలో 37,978 మంది, శింగనమలలో 44,619 మంది, తాడిపత్రిలో 40,171, ఉరవకొండలో 36,110 మంది లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ఎంపీడీఓలు, మున్సిపాలిటీల్లో కమిషనర్లు పంపిణీ బాధ్యతలను పర్యవేక్షిస్తారని తెలిపారు.

ఇంకో 23 కేసులు

ఆందోళన కలిగిస్తున్న అతిసార



రజాపురంలోని గురుకుల పాఠశాలలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఆహార భద్రత అధికారి తస్లీం

అనంతపురం టౌన్, జూన్ 27: జిల్లాలో అతిసార ప్రబలుతూనే ఉంది. రోజూ ఏదో ఒక చోట కొత్త కేసులు బయట పడుతున్నాయి. బాధితులు చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి క్యూ కడుతున్నారు. పరిస్థితినిబట్టి వారికి ఎఫ్ఎమ్ వార్డు, ఎంఎం వార్డు, చిల్డ్రన్ వార్డు, జీఈ వార్డు, ఏఎంసీలో చికిత్స చేస్తున్నారు. ఐదారు రోజులుగా దాదాపు 80 మంది జిల్లా ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. వీరిలో పలువురు కోలుకున్నారు. జిల్లా ఆస్పత్రిలో బుధవారం నాటికి 37 మంది అతిసార బాధితులు అడ్మిషన్‌లో ఉన్నారు. దీంతో కేసులు తగ్గుముఖం పట్టాయని భావించారు. కానీ గురువారం ఒక్కరోజే మరో 23 అతిసార కేసులు జిల్లా ఆస్పత్రికి వచ్చాయి. ప్రస్తుతం 60 మంది చికిత్స పొందుతున్నారని, వీరిలో అర్బన్ ప్రాంతాలవారు 34 మంది, గ్రామీణ ప్రాంతాలవారు 24 మంది ఉన్నారని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈఎన్‌టీ విభాగంలో 16 పడకలతో అతిసార కేసుల కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసి, అక్కడ కూడా చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు.

గురుకుల పాఠశాల తనిఖీ..

గుత్తి మండలం రజాపురం సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను జిల్లా ఆహార భద్రతా అధికారి తస్లీం గురువారం తనిఖీ చేశారు. కలుషిత ఆహారం, నీటి కారణంగా పదుల సంఖ్యలో బాలికలు వాంతులు, విరేచనాలతో బాధపడిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాల మేరకు గురుకుల పాఠశాలలోని ఆహార పదార్థాలు, తాగునీరు సరుకులను ఆమె తనిఖీ చేశారు. నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. నివేదికలు వచ్చిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలికలకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్, వైద్య సిబ్బందితో మాట్లాడి పరిస్థితి గురించి తెలుసుకున్నారు.

నివేదిక ఇవ్వండి: మంత్రి కేశవ్

ఉరవకొండ: మండల పరిధిలోని చిన్నముష్టూరులో అతిసారతో వృద్ధుడు మృతిచెందిన ఘటన, గుత్తి మండలం రజాపురంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బాలికల అస్వస్థతపై విచారించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ వినోద్ కుమార్‌ను మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు. అతిసార ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మంగళగిరి నుంచి ఆయన కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు.

యథేచ్ఛగా మట్టి రవాణా



అక్రమంగా మట్టి తరలించడంతో ఏర్పడ్డ గుంతలు

కూడేరు మండలంలోని వంకల నుంచి భారీస్థాయిలో మట్టి తరలిపోతోంది. వందలాది ట్రాక్టర్ల మట్టిని అక్రమంగా తరలిస్తూ.. అధికారులకు సవాలు విసురుతున్నారు. కమ్మూరు, గొట్కూరు గ్రామాల మధ్య మట్టి ట్రాక్టర్ల రద్దీ పెరిగిందని స్థానికులు అంటున్నారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో మట్టి అక్రమ రవాణా జరుగుతున్నా మైనింగ్ అధికారులు పట్టించుకోవడంలేదు. కమ్మూరు సమీపంలోని అగ్రిగోల్డ్ వెంచర్ వెనుక భాగంలో మట్టిని అక్రమంగా తరలించడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. - కూడేరు



తాగునీటి ఎద్దడిని నివారించండి

కలెక్టర్‌కు మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశం

అనంతపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఉరవకొండలో తాగునీటి ఎద్దడిని వెంటనే నివారించాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు. మంగళగిరి నుంచి ఆయన కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఉరవకొండ పట్టణంలోని 21 వార్డులలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, స్థానికులు ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే 21 వార్డులకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయించాలని ఆదేశించారు. దీంతో కలెక్టర్ వెంటనే స్పందించారు. ఉరవకొండ ప్రజలకు తక్షణమే తాగునీటిని సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ హసాన్ బాషాను కలెక్టర్ ఆదేశించారు. దీనికోసం అందుబాటులో ఉన్న నిధులను వినియోగించాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాలతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు. మంత్రి చొరవ పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్నాళ్లుంటుందో?

ఓవైపు వేస్తుండగానే మరోవైపు పాడైపోతున్న రోడ్డు

- పలు ప్రాంతాల్లో కుంగిపోతున్నవైనం
- రోలింగ్ సక్రమంగా చేయకపోవడమే కారణం
- పాడైపోయిన రోడ్డుకు ప్యాచ్‌లు వేస్తున్న కాంట్రాక్టర్
- పర్యవేక్షణలేక నాసిరకంగా పనులు
- అభాసుపాలవుతున్న రూ.ఆరు కోట్ల రహదారి

ఓ వైపు రోడ్డు పనులు జరుగుతూనే ఉన్నాయి. మరో వైపు వేసిన రోడ్డు పాడైపోతోంది. దీన్ని చూసిన ప్రజలు అబ్బా ఎంత నాణ్యతగా రోడ్డు వేస్తున్నారో.. అంటూ నిట్టూరుస్తున్నారు. ఇదీ కూడేరు నుంచి మరుట్ల రెండో కాలనీ వరకు జరుగుతున్న రహదారి పనుల దుస్థితి. పంచాయతీరాజ్‌కు చెందిన ఈ రోడ్డు నిర్మాణ పనుల (14.1కి.మీ)ను రూ.6.4కోట్ల నాబార్డ్ నిధులతో చేపట్టారు. ఎన్నికలు వస్తున్నాయన్న హడావుడిలో వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి మార్చి 18న పనులను ప్రారంభించారు. కూడేరు నుంచి అంతరగంగ, ఇప్పేరు, నాగిరెడ్డిపల్లి, కల్లగళ్ల, మరుట్ల. 1, 2, 3 కాలనీలతో పాటు పెనకచెర్ల డ్యాంకు వెళ్లేందుకు వీలుగా రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. ఎన్నికల సమయం కావడంతో రోడ్డు పనులు చేస్తే ఓట్లు పడుతాయని భావించిన వైసీపీ నాయకులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి హడావుడిగా పనులు చేయించారు. - కూడేరు



ప్యాచ్ వేయడానికి తీసిన తారు



ఇప్పేరు వద్ద దెబ్బతిన్న రోడ్డు

కుంగిపోతున్న రోడ్డు

రోడ్డు పనులు హడావుడిగా చేయడంతో నాణ్యత పూర్తిగా కొరవడింది. దీంతో తారు వేసిన వారానికే గుంతలు పడి దెబ్బతింది. మరి కొన్ని చోట్ల రోడ్డు కుంగి పోయింది. కూడేరు నుంచి నాగిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో వరకు జరిగిన పనుల్లో చాలా ప్రదేశాల్లో గుంతలు పడి రోడ్డు అధ్వానంగా మారింది. ఆయా గ్రామాల్లో ఉద్యాన పంటలతోపాటు కురగాయల సాగు అధికంగా ఉంది. ఈ రోడ్డుపై 20 టన్నుల పైబడి బరువుతో చీనీ కాయల లారీలతోపాటు, నిత్యం వందలాది వాహనాలు తిరుగుతున్నాయి. అలాంటి రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టారాజ్యంగా పనులు చేయడం వల్లనే దెబ్బతిందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా కూడేరు దాటిన తర్వాత గంపన్న తోట వద్ద రోడ్డు వేసిన ప్రదేశం మధ్యలోనే కుంగిపోయింది. కూడేరు, అంతరగంగ గ్రామాల మధ్య జరిగిన తారు రోడ్డు నిర్మాణం దాదాపు ఐదారు ప్రదేశాల్లో దెబ్బతింది. దీంతో దెబ్బతిన్న ప్రదేశాల్లో ప్యాచులు వేశారు. దీన్ని చూసిన వాహనదారులు రోడ్డు ఎన్ని సంవత్సరాలు ఉంటుందోనని పెదవి విరుస్తున్నారు. రోడ్డు నిర్మాణం చేసే సమయంలో కంకరతోపాటు రోడ్డుకు ఇరువైపులా మట్టిని వేసి రోలింగ్ సక్రమంగా చేయకపోవడంతో వర్షాలకు మట్టి కొట్టుకుపోయింది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే పనులు నాసిరకంగా జరుగుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి.



రోడ్డుకు ఇరువైపులా మట్టిని రోలింగ్ చేయకుండా ఇలా వదిలేశారు..

మళ్లీ పనులు చేయిస్తాం..

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి. ఎక్కడైనా రోడ్డు దెబ్బతింటే తిరిగి పనులు చేయిస్తాం. కంకర వేసి రోలింగ్ చేసిన తర్వాత ఒక ఇంచుతో తారు వేయిస్తాం. పనులు నాణ్యంగా జరిగేలా పర్యవేక్షిస్తాం.

- శేషయ్య, ఏఈ

నెలకే ప్యాచ్‌లు



కూడేరు నుంచి మరుట్ల వరకు జరుగుతున్న రోడ్డు పనులు అధ్వానంగా చేశారు. తారు రోడ్డు వేసిన నెలకే తారు లేచిపోవడంతో గుంతలు పడ్డాయి. రోడ్డుపై వేసిన బ్రిడ్జిలు కూడా కుంగిపోతున్నాయి. అధ్వానంగా పనులు జరుగుతు న్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

- సతీష్ గౌడ్ (అంతరగంగ)

ఇంత అధ్వానంగానా?



నూతనంగా నిర్మిస్తున్న రోడ్డును రోలింగ్ సక్రమంగా చేయకపో వడంతో ఇరువైపులా దెబ్బతింది. దీంతో గుంతలు పడటంతో ఎన్ని రోజులు రోడ్డు ఉంటుందో తెలియడం లేదు. రోడ్డు వేసే సమయంలో అధికారులు ఉంటే కాంట్రాక్టర్ పనుల నాణ్యతగా చేస్తారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే పనులు సక్రమంగా జరగలేదు.

- హనుమంతు (కలగళ్ల)

అధికారం శాశ్వతమనుకుంటే పొరపాటే

● మాజీ మంత్రి దివాకర్‌రెడ్డి


మంత్రి సవితను కలిసిన మాజీ మంత్రి దివాకర్‌రెడ్డి

పెనుకొండ టౌన్, జూన్ 27: అధికారం శాశ్వత మనకుకుంటే పొర పాటని మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి అన్నారు. గురు వారం పెనుకొండ టీడీపీ కార్యాల యంలో మంత్రి సవితను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మాట్లాడుతూ అధికారం ఉంది కదా అని వైసీపీ నాయకులు దర్బార్‌ను ప్రదర్శించారన్నారు. అందుకే 11 సీట్లకు పరిమితమయ్యారని పేర్కొన్నారు. ఎవరైనా రూల్స్, రెగ్యులేషన్స్‌ను పాటించాలని సూచించారు. అప్పుడే నాలుగు కాలాలపాటు ఉంటారని, వారిని కూడా ప్రజలు గుర్తిస్తారన్నారు. వై నాట్ 175 అని విర్రవీగితే ప్రజల తీర్పు ఇలానే ఉంటుందన్నారు.

టీడీపీ పార్లమెంటరీ కమిటీ కార్యదర్శిగా బీకే



పెనుకొండ, జూన్ 27: టీడీపీ పార్లమెంటరీ కమిటీ కార్యదర్శిగా హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథి నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు నియామక పత్రాన్ని జారీ చేశారు. తనను టీడీపీ పార్లమెంటరీ కమిటీ కార్యదర్శిగా నియమించినందుకు ముఖ్యమంత్రికి పార్థసారథి కృతజ్ఞతలు తెలిపారు.

మోటార్లకు మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున


ఏఓకు వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

అనంతపురం రూరల్, జూన్ 27: మోటార్లకు మీటర్ల ఏర్పాటును నూతన ప్రభుత్వం నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున కోరారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో పలు డిమాండ్లతోకూడిన వినతిపత్రాన్ని ఏఓ పద్మావతికు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెట్టుబడి సాయంగా రైతులకు రూ. 20 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. పంట రుణాలకు సంబంధించి రూ.3లక్షల వరకు వడ్డీలేకుండా, రూ.5లక్షల వరకు పావలా వడ్డీతో ఇవ్వాలన్నారు. అదేవిధంగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియ చేపట్టి రుణాలు అందించాలన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు ఏర్పాటు చేసి రైతులకు అన్యాయం చేయాలని చూసిందన్నారు. ఆ ప్రక్రియను నిలుపుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం నాయకులు రమేష్, చలపతి, నగేష్, వెంకటరాముడు, మండల నాయకులు అక్కులప్ప, రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఎన్నికల్లో మీ సేవలు భేష్

డీఐజీ షిమోషి, ఎస్పీ గౌతమిశాలి

సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేత


డీఐజీ షిమోషికి భోజనం..

అనంతపురం క్రైం, జూన్ 27: సార్వత్రిక ఎన్నికల్లో మీ సేవలు భేష్ అని అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, ఎస్పీ గౌతమిశాలి జిల్లా పోలీసులను అభినందించారు. తాడిపత్రి ఘటన మినహా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగించడం సమష్టి కృషి ఫలితమేనన్నారు. గురువారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రశంసాపత్రాలు, రివార్డులను ఎస్పీ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల్లో శ్రమించిన ప్రతి ఒక్క పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. నామినేషన్ల ఘట్టం, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియల్లో హోంగార్డుల నుంచి పోలీస్ అధికారుల వరకు సమర్థవంతంగా విధులు నిర్వర్తించారన్నారు. మున్ముందు ఇదే స్ఫూర్తి కొనసాగించాలని సూచించారు. జిల్లాను ప్రశాంతంగా ఉంచడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఉండాలన్నారు. ప్రజలతో మమేకమై మర్యాదగా వ్యవహరించడంతోపాటు పోలీసుల పట్ల విశ్వాసం పెంపొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని పిలుపునిచ్చారు. హోదాలు మరచి పనిచేయడమే కాకుండా పరస్పరం గౌరవించుకుందామని కోరారు. అనంతరం సిబ్బందికి భోజనం వడ్డించి, వారితో కలిసి డీఐజీ, ఎస్పీ భోజనం చేశారు.

చీనీకాయలు టన్ను రూ.27 వేలు

అనంతపురం రూరల్, జూన్ 27: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.27 వేలు, కనిష్ఠంగా రూ.8 వేలు, సరాసరి రూ.16 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 580 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.


అన్నదాత ఆశలపై నీళ్లు

గత టీడీపీ హయాంలో ఉచిత వ్యవసాయ మోటార్ల సరఫరా

పంపిణీని పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

మూలనపడ్డ మోటార్లు

కూటమి ప్రభుత్వ ఏర్పాటుతో ఆశలు




ఐఎస్ఐ మార్కు కలిగిన పంపులు

తాడిమర్రి, జూన్ 27: రైతు ప్రభుత్వమని చెప్పుకున్న వైసీపీ పాలకులు.. వారిపైనే తీవ్ర నిర్లక్ష్యం చూపారు. గత టీడీపీ హయాంలో సరఫరా అయిన ఉచిత వ్యవసాయ మోటార్లను రైతులకు అందించకుండా తీవ్ర నిర్లక్ష్యం చేశారు. దీంతో ఏడేళ్లుగా అవి మూలనపడ్డాయి. అధికారులు సైతం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి.. వాటి పంపిణీని అటకెక్కించారు. దీంతో దాదాపు కోటి రూపాయల విలువచేసే మోటార్లు, పంపులు నిరుపయోగంగా పడి ఉన్నాయి.

పట్టించుకోని గత వైసీపీ పాలకులు


స్టార్టర్ పెట్టెలు

వ్యవసాయానికి విద్యుత్ వాడకాన్ని తగ్గించడంలో భాగంగా రైతులకు అధునాతన మోటార్లను ఉచితంగా అందించాలని 2017 చివర్లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయించింది. 240 వ్యవసాయ మోటార్లు, పంపులు, స్టార్టర్ పెట్టెలను సరఫరా చేసింది. వీటి ద్వారా విద్యుత్ వినియోగం తగ్గుతుంది. తక్కువ ఓల్టేజీలో కూడా ఎక్కువ నీరు పారించే అవకాశం ఉంటుంది. ఇంకొన్ని మోటార్లు సరఫరా కావాల్సి ఉండడంతో అన్నీ వచ్చాక పంపిణీ చేద్దామని అప్పట్లో వేచిచూశారు. 2018 ఆఖర్లో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం కొలువుదీరింది. వ్యవసాయ మోటార్ల పంపిణీని వైసీపీ పాలకులు ఐదేళ్లు పట్టించుకోలేదు. ఆ తరువాత ఉమ్మడి జిల్లాలోని కొన్ని విద్యుత్‌శాఖ కార్యాలయాలకు నీటిని అందించేందుకు ఇక్కడి మోటార్లు, పంపులను తీసుకెళ్లారని తెలిసింది. ఇలా.. అన్నదాత ఆశలపై వైసీపీ పాలకులు నీళ్లు చల్లారు. ఇటీవలి సార్వత్రిక ఎన్నిల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయి, కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. మోటార్లను పంపిణీ చేస్తారని మండల రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



పేద రైతులకు అందించాలి

తాడిమర్రి ట్రాన్స్‌కో కార్యాలయంలో ఉన్న మోటార్లను పేద రైతులకు అందించాలి. వాటి వినియోగం ద్వారా రైతులకు వ్యవసాయ ఖర్చులు తగ్గనున్నాయి. తక్కువ ఖర్చుతో పంటలు పండించేందుకు వీలవుతుంది.

- ఫక్కీర్‌రెడ్డి, రైతు, శివంపల్లి

నిరీక్షణ ఫలించేనా?



ఉచిత మోటార్ల కోసం ఏడేళ్లుగా ఎదురు చూస్తున్నాం. కూటమి పాలకులు స్పందించి, వాటిని వెంటనే పంపిణీ చేయాలి.

- నాగేంద్ర, రైతు, మద్దెలచెరువు

మోటార్ల రికార్డులు లేవు

ఉచిత మోటార్లకు సంబంధించిన రికార్డులు మావద్దలేవు. అప్పట్లో కంపెనీ ప్రతినిధులు కార్యాలయంలో దింపారు. అప్పటి ఏఈకి రికార్డులు ఇచ్చి ఉంటారు. ఇప్పుడు ఆ పథకం రద్దయింది. మోటార్లు పంపిణీ చేయాలన్నా.. తిరిగి వెనక్కి పంపాలన్నా.. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.

- విజయశంకర్, ట్రాన్స్‌కో ఏఈ

ఉపాధి హామీ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ఒకటో తేదీన రూ.7 వేలు పింఛన్ పంపిణీ

గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోండి

ఎంపీడీఓలు, ఈఓఆర్డీలకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం


మాట్లాడుతున్న పరిటాల సునీత

అనంతపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో చోటుచేసుకున్న అక్రమాలపై సమగ్రంగా విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎంపీడీఓలు, ఈఓఆర్డీలతో సమావేశమయ్యారు. ముందుగా ఉపాధి అక్రమాలు, గ్రామాల్లో తాగునీటి ఎద్దడి, పారిశుధ్యం, అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. ఏ మండలంలో ఏ తరహా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి..? ఆగిపోయిన పనులు ఏవి..? తదితర విషయాలపై అధికారులతో ఆరా తీశారు. అనంతరం ఆమె ఆ అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు జూలై 1న పింఛన్ల పంపిణీ చేస్తున్న నేపథ్యంలో. ఆ ఏర్పాట్లు చేయాలన్నారు. పంపిణీలో భాగంగా మొదటిరోజు మూడు మండలాల్లో, రెండవ రోజు మూడు మండలాల్లో తాను స్వయంగా భాగస్వామినవుతానన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు పాల్గొనాలన్నారు. ప్రస్తుతం సచివాలయాల నిర్వహణ ఎలా ఉందని ఆమె ఆరా తీశారు. వర్షాకాలం నేపథ్యంలో డ్రైనేజీ నీరు, వర్షపు నీరు ఎక్కడపడితే అక్కడ నిల్వ ఉంటోందని, వాటిపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో జ్వరాలు ప్రబలే అవకాశమున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. డ్రైనేజీ సమస్య లేకుండా చూడాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం, పైపులైన్ల లీకేజీలు అరికట్టడం వంటి వాటి మీద దృష్టి పెట్టాలన్నారు. ఉపాధి హామీ బిల్లులు మంజూరులో జాప్యం లేకుండా చూడాలన్నారు. స్థానికంగా లేని వారు పేరుపై జాబ్‌కార్డులు తయారు చేసి ఉపాధి బిల్లులు మంజూరులో భారీ అక్రమాలు జరిగాయన్నారు. వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పండ్లతోటల మొక్కలు పెట్టకపోయినా లేని చెట్లను ఉన్నట్లు చూపి బిల్లులు మంజూరు చేస్తున్నారని వాటిని వెంటనే ఆపేయాలన్నారు. సర్పంచ్ ఎన్నికల సమయంలో ఓడిపోయిన, విత్ డ్రా చేసుకున్న వారి డిపాజిట్స్ వెనక్కు ఇవ్వలేదన్నారు. ఆ డబ్బును తిరిగి చెల్లించాలని సూచించారు. అలాగే ప్రాధాన్యత వారీగా తక్షణం చేపట్టాల్సిన పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. ఎక్కడా నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. అభివృద్ధి పనులకు అంచనాలు సిద్ధం చేయాలన్నారు. అన్ని శాఖలకు నివేదికలు పంపిద్దామని సూచించారు. సమీక్ష అనంతరం ఎమ్మెల్యే పరిటాల సునీతకు ఆయా శాఖల అధికారులు, అనధికారులు, నాయకులు, కార్యకర్తలు పూలబొకెలతో శుభాకాంక్షలు తెలిపారు.

శాంతి భద్రతలే ప్రధానం

నెలవారి సమీక్షలో ఎస్పీ గౌతమి శాలి

అనంతపురం క్రైం, జూన్ 27: శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ గౌతమి శాలి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పోలీస్, సెబ్ అధికారులతో పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమె నెలవారీ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో నమోదైన వివిధ రాకల కేసులు, నేరాల గురించి సబ్ డివిజన్ల వారిగా సమీక్షించారు. దర్యాప్తులో పురోగతి సాధించాలని సూచించారు. రౌడీ షీటర్లు, కిరాయి హంతకుల కదలికలపై నిఘా వేయాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని, శాంతి భద్రతల పరిరక్షణ, ప్రకృతి వైపరీత్యాలు, వీజీపీల భద్రత, సంచలనాత్మక నేరాలు జరిగిన సమయాల్లో ఏం చేయాలో దిశానిర్దేశం చేశారు. మట్కా, పేకాట, మత్తు పదార్థాలు, నాటు సారా కట్టడికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. జూదం నిర్వహించినా, ప్రోత్సహించినా, వారితో సంబంధాలు కొనసాగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. బేసిక్ పోలీసులో భాగంగా డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్, పెట్టీ కేసులపై దృష్టి పెట్టాలని సూచించారు. మానవ హక్కులకు భంగం కలగకుండా చర్యలు ఉండాలని, కోర్టు ఉత్తర్వులు పక్కాగా పాటించాలని సూచించారు. నిందితులను పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చినప్పుడు నిబంధనల ప్రకారమే వ్యవహరించాలని అన్నారు. రాత్రి నిఘాలో భాగంగా బీట్స్, పెట్రోలింగ్, రోడ్ సేఫ్టీ బృందాలు, కంట్రోల్ రూం సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, డీఎస్పీలు ఆంథోనప్ప, టీవీవీ ప్రతాప్, శ్రీనివాసులు, శివభాస్కర్‌రెడ్డి, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

పీజీ సెట్‌లో మెరిసిన అనంత విద్యార్థులు

27 మందికి రాష్ట్రస్థాయిలో 'పది'లోపు ర్యాంకులు


భావన


ప్రసన్నసాయి


ఈశ్వరయ్య


బద్రీనాథ్


షాహిద


నాగేంద్ర


సలీం


లక్ష్మి

అనంతపురం సెంట్రల్, జూన్ 27: పోస్ట్ గ్రాడ్యుయేట్(పీజీ) కోర్సుల మొదటి సంవత్సరం ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షా ఫలితాల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు మెరిశారు. 31 కోర్సులకు నిర్వహించిన పరీక్షల్లో 27మంది విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పది లోపు ర్యాంకుల్లో చోటు దక్కించుకున్నారు. సెరికల్చర్ కోర్సులో ఏకంగా నలుగురు విద్యార్థులు ర్యాంకులు సాధించడం విశేషం. కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్, ఎలక్ట్రానిక్స్, ఇంగ్లీష్, కామర్స్, జియోలజీ, హిస్టరీ, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్, మనస్తత్వ శాస్త్రం, తమిళ్, తెలుగు, జంతుశాస్త్రం కోర్సుల్లో పదిలోపు ఒక్క ర్యాంకు కూడా సాధించలేకపోయారు. కోర్సుల వారీగా ర్యాంకులను పరిశీలిస్తే ఎడ్యుకేషన్‌లో అమరేష్ 3వ ర్యాంకు, ఎఫ్ఎస్ఎస్‌లో భావన 1, హసీన 6వ ర్యాంకు సాధించారు. అదేవిధంగా బీఎఫ్ఏలో పవన్‌కళ్యాణ్ 2వ ర్యాంకు, బోటనీలో ప్రసన్నసాయి 2, దివ్యశ్రీ 4, శ్రీలత 6వ ర్యాంకులు కైవసం చేసుకున్నారు. జనరల్‌లో ఈశ్వరయ్య మొదటి ర్యాంకు, నాగేంద్ర 6, జియోగ్రఫీలో సలీమ్ 4, బద్రినాథ్ 9, హిందీలో షాహిద 10, లైఫ్ సైన్స్‌లో భావన 4వ ర్యాంకు సాధించారు. సాహిత్యంలో యూన్సీ 2వ ర్యాంకు, గణితశాస్త్రంలో విష్ణువర్ధన్ 12, పర్ఫార్మింగ్ ఆర్ట్స్ అండ్ మ్యూజిక్‌లో సునీత 3, ఫిజికల్ సైన్సెస్‌లో భాను 12, పొలిటికల్ సైన్స్‌లో హరిత 5, పాలిమర్ సైన్స్‌లో కల్పన 2వ ర్యాంకు తెచ్చుకున్నారు. సంస్కృతంలో స్వప్నకుమారి 5వ ర్యాంకు, రేవతి 9, సెరికల్చర్‌లో మహాలక్ష్మి 2, ప్రకాష్ 8, వైష్ణవి 9, చందన 10, పర్యాటక మౌనిక 8, ఉర్దూ అస్మా హుమైరా 5 ర్యాంకు సాధించారు. వీరితోపాటుగా బీఈడీ కోర్సుల పరీక్షల్లో మెథడాలజీ ఫిజికల్ సైన్స్‌లో చిలమత్తూరుకు చెందిన లక్ష్మీ తృతీయ ర్యాంకు సాధించింది.

వీసీల రాజీనామా

అనంతపురం సెంట్రల్, జూన్ 27: జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీనివాసరావు, ఎస్కేయూ వీసీ హుస్సేన్ రెడ్డి తమ పదవులకు గురువారం రాజీనామా చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి వీరు రాజీనామా లేఖలను పంపారు. జేఎన్‌టీయూఏ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్ కూడా తన పదవికి రాజీనామా చేశారు. ఎస్కేయూ రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య కూడా రాజీనామా చేసినట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి. అధికారికంగా ప్రకటించలేదు. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ అయిన శ్రీనివాసరావును జనవరి 17న అప్పటి ప్రభుత్వం జేఎన్‌టీయూఏ వీసీగా నియమించింది. ఆయన బాధ్యతలు చేపట్టి ఐదు నెలలు గడిచింది. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారని సమాచారం. జేఎన్‌టీయూఏ రిజిస్ట్రార్‌గా శశిధర్ మూడు సంవత్సరాలు పనిచేశారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సత్యనారాయణను జేఎన్‌టీయూఏ ఇన్‌చార్జ్ వీసీగా నియమించారు. ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరిస్తారు.

7 నుంచి గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు

నార్పల, జూన్ 27: గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు జూలై 7వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ ఈఓ సాకేతపురం శోభ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. జూలై 7న కుళ్లాయిస్వామి ప్రథమ దర్శనంతో ప్రారంభమై జూలై 19వ తేదీన కుళ్లాయిస్వామి చివరి దర్శనంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. జూలై 7న కళ్లాయిస్వామి ప్రథమ దర్శనం, 8న స్వామివారి నిత్యపూజ నివేదన ఉంటాయన్నారు. 9న అగ్నిగుండం ఏర్పాటు, 10న స్వామివారిని నిలుపుట, 11న స్వామి వారి నిత్యపూజ నివేదన, 12న స్వామి వారి ఐదవ సరిగెత్తు నిర్వహించడం జరుగుతుందన్నారు. 13న నిత్యపూజ నివేదన, 14న స్వామివారి ఏడవ సరిగెత్తు, 15న స్వామివారి నిత్యపూజ నివేదన ఉంటాయన్నారు. 16న స్వామివారి గ్రామోత్సవం, రాత్రి స్వామి వారి అగ్నిగుండ ప్రవేశం, 17న 4 గంటలకు అగ్నిగుండ ప్రవేశం, జలధికి పోయే కార్యక్రమాలు ఉంటాయన్నారు. 19న కుళ్లాయిస్వామి భక్తాదులకు చివరి దర్శనంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఈఓ పేర్కొన్నారు.

పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ నియామకం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 27: ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు ఉన్న సొసైటీలు, ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్‌ల కమిటీలకు సంబంధించిన రాజీనామాలను ప్రభుత్వం ఆమోదించింది. దీంతో ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్‌లకు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌ను పర్సన్ ఇన్‌చార్జిగా నియమించారు. తదుపరి కమిటీల నియామకం, ఎన్నికలు జరిగే వరకు పర్సన్ ఇన్‌చార్జి పాలన కొనసాగనుంది.

సూర్యదేవుడి విగ్రహంపై విచారణ

గుమ్మఘట్ట, జూన్ 27: రైతు పొలంలో లభించిన సూర్యదేవుడి విగ్రహంపై తహసీల్దార్ వెంకటేశ్వర్లు గురువారం విచారణ జరిపారు. కలుగోడు గ్రామంలో 2020వ సంవత్సరంలో వేదావతి హగరి సమీపంలో రైతు నాగేంద్ర పొలంలో విగ్రహం బయటపడిన విషయం తెలిసిందే. దీనిని గ్రామస్థులు ఆంజనేయ స్వామి ఆలయంలోని ఒక పెట్టెలో భద్రపరిచారు. అయితే ఈ విగ్రహంపై కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాలతో తహసీల్దార్ విచారణకు వచ్చారు. లభించిన విగ్రహానికి గుడికట్టుకుని పూజలు నిర్వహించుకుంటామని గ్రామపెద్దలు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. 20 రోజులు గడువు ఇస్తున్నామని, గుడి నిర్మించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో విగ్రహాన్ని స్వాధీనపరచుకుంటామని తెలిపారు.

బీటెక్ పరీక్షా ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జూన్ 27: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ ఫలితాలను గురువారం ప్రిన్సిపాల్ సత్యనారాయణ విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్వితీయ, తృతీయ సంవత్సరం రెండవ సెమిస్టర్(ఆర్20) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలను మేలో నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, డీసీఓలు విష్ణువర్ధన్, తలితకుమారి, విభాగాధిపతులు మమత, అజిత పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం


నితిన్

నంబులపూలకుంట, జూన్ 27: మండలంలోని పల్లెనివారిపల్లికి చెందిన విద్యార్థి నితిన్ కనిపించడంలేదని తండ్రి చంద్రమోహన్ గురువారం తెలిపారు. అన్నమయ్య జిల్లా వెలిగల్లులో తమను ఈనెల 12న ద్విచక్ర వాహనంలో నితిన్ వదిలిపెట్టాడన్నారు. అమ్మమ్మ ఊరైన పాపన్నగారిపల్లికి వెళ్లాలని తాము సూచించామని వివరించాడు. పాపన్నగారిపల్లికి వెళ్లి రెండు రోజుల తరవాత మదనపల్లికి నితిన్ వెళ్లాడన్నారు. అప్పటి నుంచి అతడి ఆచూకీ లభించలేదని, బంధువులు, స్నేహితులను విచారించినా ఆచూకీ లభించలేదన్నారు. మనపల్లిలోని ఓ కాలేజీలో ఎంపీసీలో చేర్పించామని, మార్కులు తక్కువ రావడంతో తిరుపతిలోని ఓ కార్పొరేట్ కళాశాలలో జాయిన్ చేయించామన్నారు. మదనపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తండ్రి చంద్రమోహన్ వివరించాడు. ఆచూకీ లభిస్తే సెల్ నెంబర్ 6309821670కు సమాచారం ఇవ్వాలని కోరాడు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


రమణ

తనకల్లు, జూన్ 27: విద్యుదాఘాతంతో రైతు రమణ(40) మృతిచెందిన ఘటన తనకల్లు మండలంలోని బొంతపల్లి పంచాయతీ కొండకిందపల్లి(రత్నగిరి)గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. మృతుడు అన్నమయ్య జిల్లా వడ్డివాండ్లపల్లికి చెందిన రైతు. ఇతడికి అన్నమయ్య జిల్లాతోపాటు శ్రీసత్యసాయి జిల్లాలోని కొండకిందపల్లిలో పొలాలు ఉన్నాయి. అందులో భాగంగా కొండకిందపల్లిలో టమోటా సాగు చేశాడు. గురువారం పంటకు నీరు పడుతుండగా మోటారు ఆగిపోయింది. పరిశీలించగా స్టార్టర్‌లో ఫ్యూజు పోయిందని తెలుసుకుని తనే మరమ్మతు చేసి ఫ్యూజు వేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడికక్కడే మృతిచెందాడు. తనకల్లు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్తంగా..

ఘనంగా పరిశ్రమల దినోత్సవం

అనంతపురం అర్బన్: జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ పరిశ్రమల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పరిశ్రమల శాఖ జీఎం నాగరాజారావు, ఏపీఐఐసీ జడ్ఎం నాగార్జున, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు శేషాంజనేయులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామిక ఔత్సాహికులకు అందిస్తున్న సబ్సిడీ తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ సిబ్బంది, పారిశ్రమల యజమానులు పాల్గొన్నారు.

ఆర్థిక సమస్యలపై సమీక్ష

అనంతపురం విద్య : జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీల ఆర్థిక వనరులు, ఆర్థిక సమస్యలపై స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలోని డీపీఆర్సీ సమావేశ మందిరంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఐదో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుడు రమణారెడ్డి, జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించారు. ఇందులో రమణారెడ్డితో పాటు సభ్యులు ప్రసాదరావు, పద్మారావు, కృపారావు, జడ్పీ సీఈఓ మాట్లాడారు. గ్రామా పంచాయతీ ఆదాయ వనరులు పెంచాలని, ప్రస్తుత మార్కెట్ విలువ మేరకు పంచాయతీల్లో పన్నులు సవరించాలని కోరారు. పంచాయతీలు స్వయం ప్రతిపత్తి సాధించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ లలితాదేవి, డీపీఓ ప్రభాకర్, ఉమ్మడి జిల్లాల పరిధిలోని సర్పంచులు, ఈఓఆర్డీలు, పంచాయతీ సెక్రెటరీలు పాల్గొన్నారు.

నీలం విజయ్‌కుమార్‌కు నివాళి

అనంతపురం కల్చరల్ : స్వాతంత్ర సమర యోధుడు సీపీఐ జాతీయ నాయకుడు నీలం రాజశేఖర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ నీలం విజయ్‌కుమార్ మృతికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాం భూపాల్ గురువారం ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అన్నారు.

నార్పల ఎస్‌ఐకి ప్రశంస



నార్పల: చాకచక్యంగా వ్యవహరిస్తూ కేసులను పరిష్కరించిన నార్పల ఎస్‌ఐ రాజశేఖర్ రెడ్డికి ఎస్పీ గౌతమిశాలి ప్రశంస పత్రాన్ని గురువారం అందజేసి అభినందించారు. నార్పలలో సంచల నంగా మారిని చిన్నారి పావని అదృశ్యం కేసులో ఎస్ఐ, బృందం తమదైన శైలిలో విచారణ చేశారు. చిన్నారి పావనిని తండ్రి గణేష్ హత్య చేసి పాడుపడ్డ బావిలో పడేశాడు. సంఘటన జరిగిన రెండు రోజుల్లోనే నిందితుడిని అరెస్ట్ చేశారు. అలాగే గతంలో కూడా రైతుల తోటల్లో డ్రిప్ పైపులు, మోటార్ల చోరీలకు పాల్పిడిన దొంగలను కూడా 24 గంటల్లోనే అరెస్ట్ చేసిన ఎస్‌ఐని పలువురు అభినందించారు.

ఆ స్కూళ్లను సీజ్ చేయాలి

అనంతపురం విద్య : జిల్లాలో పుస్తకాలు అమ్ముతున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పీడీఎస్‌యూ, పీఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, ఆర్ఎస్‌వైఎఫ్, ఏఎస్ఓ తదితర సంఘాల నాయకులు నగరంలోని ఒక కార్పొరేట్ స్కూల్ వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ..... అలాంటి కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు కొందరు విద్యాశాఖాధికారులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు వీరేంద్రప్రసాద్, ప్రతిభాభారతి, అబ్దుల్ ఆలం, ఓబులేసు, అరుణ్‌కుమార్, సాయి, చరణ్, హేమంత్, ఆఫ్రిద్, రాజేష్, భీమేష్, చిరంజీవి, నవీన్ పాల్గొన్నారు.

దాడి కేసులో వ్యక్తి అరెస్టు

గార్లదిన్నె : మండలంలోని జంబులదిన్నె గ్రామానికి చెందిన వృద్ధురాలు పుల్లమ్మపై రెండు రోజుల క్రితం దాడి చేసిన అదే గ్రామానికి చెందిన చిన్న సుబ్బన్నను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పుల్లమ్మ కుమార్తె లక్ష్మీదేవి భర్త ఏడు సంవత్సరాలు క్రితం చనిపోయాడు. అదే గ్రామానికి చెందిన చిన్న సుబ్బన్నతో చనువుగా ఉండేవారు. అయితే వారం రోజుల నుంచి లక్ష్మీదేవి కనిపించికపోవడంతో బుధవారం సాయంత్రం చిన్నసుబ్బన్న పుల్లమ్మతో గొడవపడ్డాడు. పుల్లమ్మను గ్రామ సమీపంలో ఉన్న చెరువులోకి లాకెళ్లి తీవ్రంగా కొట్టి చెరువులోనే వదిలేశాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు పుల్లమ్మను చికిత్స నిమిత్తం అనంతపురం అస్పత్రికి తరలించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలి బంధువులు చిన్నసుబ్బన్నపై ఫిర్యాదు చేశారు. చిన్నసుబ్బన్నపై కేసు నమోదు చేసి.. అతన్ని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్ గురువారం తెలిపారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

గార్లదిన్నె : భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలని జిల్లా వనురుల కేంద్రం (డీఆర్సీ) డిడిఏ మద్దిలేటి పేర్కొన్నారు. 2024 ఖరీఫ్ సీజన్‌లో పండించే ఆముదం, వేరుశనగ, వరి, పత్తి పంటలపై వ్యవసాయ అధికారి సోమశేఖర్ ఆధ్వర్యంలో గురువారం కల్లూరు రైతు భరోసా కేంద్రంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో డీడీఏ మద్దిలేటితో పాటు అనంతపురం డివిజన్ సంచాలకులు రవి, టెక్నికల్ అగ్రికల్చర్ (ఏడిఏ ఎఫ్‌టీసీ) అధికారి శైలజ మాట్లాడారు. భూమిలో ఒకే పంట సాగుచేయడం ద్వారా భూసారం తగ్గి ఆశించినంత దిగు బడి రాదన్నారు. పంట మార్పిడి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఏఈఓ, విఏఏ, విహెచ్ఏలు, ఎంపీఈఓలు, రైతులు పాల్గొన్నారు.

నేను బడికి పోతాపై ర్యాలీ

ధర్మవరం రూరల్ (కనగానపల్లి) : కనగానపల్లి మండలంలోని మామిళ్లపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్ఎం స్నేహలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

7న బ్రాహ్మణ సమ్మేళనం

అనంతపురం కల్చరల్, జూన్ 27 : జిల్లా బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో వచ్చే నెల 7న ఉదయం 10.30 గంటలకు స్థానిక మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం కల్యాణమండపంలో బ్రాహ్మణ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని, దాన్ని జయప్రదం చేయాలని ఐక్యవేదిక నాయకుడు, న్యాయవాది హోసూరు రామసుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం ఐక్యవేదిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రపంచశాంతికోసం శాంతి హోమం నిర్వహించి, అనంతరం నిర్వహించే సమ్మేళనంలో బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామన్నారు. జిల్లాలోని బ్రాహ్మణులంతా విరివిగా పాల్గొని సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బ్రాహ్మణ ఐక్యవేదిక నాయకులు రఘు, ఏఎల్ఎన్ శాస్త్రి, వీఆర్ఓ సుబ్రహ్మణ్యం, జనసేన విశ్వనాథ్, బాలాజీ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

అనంతపురం క్రైం, జూన్ 27: మలేరియా వ్యతిరేక వారోత్సవాలను పురస్కరించుకుని నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ బాలల, బాలికల వసతిగృహాల్లో దోమల నివారణకు గురువారం మలథియాన్ స్ప్రేయింగ్ చేయించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య పర్యవేక్షణలో బీసీ ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాల వసతిగృహం, ఎస్టీ, మైనార్టీ బాలికల వసతిగృహాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దోమలు గదుల్లోకి రాకుండా మెష్ బిగించుకోవాలని ఎంహెచ్ఓ విష్ణుమూర్తి సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ సూపర్‌వైజర్లు నూర్‌బాషా, శ్రీధర్‌మూర్తి పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే ఉపేక్షించం

ఎమ్మెల్యే పరిటాల సునీత హెచ్చరిక

చెన్నేకొత్తపల్లి, జూన్ 27: తమ ప్రభుత్వంలో మహిళలను లైంగికంగా వేధించే వారిని ఉపేక్షించే ప్రసక్తే ఉండదని, వారికి కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే పరిటాల సునీత హెచ్చరించారు. మండలంలోని ఎన్ఎస్‌గేటు ప్రాథమిక ఆస్పత్రి వైద్యుడు ఉదయ్ తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల నాయకుడు లింగన్నతో కలిసి పలువురు ఏఎన్ఎంలు గురువారం అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి డాక్టర్ ఉదయ్ లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేశారు. అన్ని సాక్ష్యాలున్నా సంబంధిత వైద్యుడిపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యాధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్ఓ మంజుల వాణిని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయంలో ఒక వైద్యుడు మహిళలను వేధిస్తుంటే ఉపేక్షించడమేంటని మండిపడ్డారు. టీడీపీ హయాంలో మహిళలకు పూర్తి రక్షణ ఉంటుందని ఏఎన్ఎంలకు భరోసా ఇచ్చారు. వైద్యుడిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసిన ఏఎన్ఎంలు

కళాశాలలో సౌకర్యాలు కల్పిస్తాం

రామగిరి : వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. రామగిరిలోని ఆచార్య ఎంజీ రంగ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు, సమస్యలపై కాలేజ్ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంతో అనంతపురం క్యాంప్ కార్యాలయంలో గురు వారం ప్రత్యేకంగా సమావేశమైన చర్చించారు. ప్రస్తుతం కళాశాలలో ఉన్న సౌకర్యాలు, ఇంకా కావాల్సిన అవసరాల గురించి ఆరాతీశారు. ఈ సందర్భంగా కళాశాలకు అంబులెన్స్, మినీ బస్, ఎల్‌సీడీ ప్రొజెక్టర్, సీసీ కెమెరాలు, ప్రహరీ .. అవసరమని ప్రిన్సిపాల్ తెలిపారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

అవినీతి అధికారులూ.. బదిలీపై వెళ్లండి
ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల జూన్ 27: అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు అభివృద్ధికి సహకరించాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేసే, అవినీతి పాల్పడే అధికారులు వెంటనే బదిలీపై వెళ్లాలని హెచ్చరించారు. గురువారం నిర్వహించిన శింగనమల మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం జూలై ఒకటో తేదీన పంపిణీ చేసే పింఛన్లపై గ్రామాల్లో అధికారులు ప్రజాపతినిధులు విరివిగా ప్రచారం చేపట్టాలన్నారు. చంద్రన్న ఇచ్చిన హామీలో భాగంగా జూలైలో రూ.7000 ఇస్తున్నట్లు వివరించాలన్నారు. గత ప్రభుత్వంలో అధికారులు అనర్హులకు ఎక్కువ మందికి పింఛన్లు మంజూరు చేశారని, అధికారులు నియోజకవర్గంలో పింఛన్లపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి పార్టీలకు అతీతంగా అనర్హులను తొగించడానికి ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామస్థులు సమస్యలను అధికారులు, తన దృష్టికి తీసుకురావాలని, నిత్యం అందుబాటులో ఉండి వాటిని పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యోగేశ్వరి ఎంపీడీఓ బి.వెంకటరమణ. తహసీల్దార్ శోభన్‌బాబు, వైస్ ఎంపీఎంలు విజయ, నరసింహులు సీడీపీఓ ఉమాశంకరమ్మ, ఏవో అన్వేష్‌కుమార్, సర్పంచులు రమేష్, రాజు, రాజారెడ్డి డేగల లలితమ్మ నగమునేమ్మ, అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

రైతు సమస్యలు పరిష్కరించండి

నియోజకవర్గంలోని రైతుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్, నాయకులు వినతి పత్రం అందజేశారు. రైతులకు ఖరీఫ్ సీజన్‌కు అన్నదాత సుఖీభవ రూ20 వేలు రైతుల ఖాతాలో జమ చేయాలని, సబ్సిడీతో విత్తనాలు ఎరువు ఇవ్వాలని కోరారు. ఆయన వెంట నేసే మధుయాదవ్, చంద్రశేఖర్ ఉన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

అనంతపురం రూరల్, జూన్ 27: వేరుశనగ పంట సాగు సమయంలో విత్తనశుద్ధి తప్పని సరిగా చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎ.నారాయణపురం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి శశికళ ఆధ్వర్యంలో సాగుకు సమాయత్తం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆమెతో పాటు రేకులకుంట పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు మాట్లాడారు. విత్తన శుద్ధి ఇమిడాక్లోప్రిడ్‌తో 2.5 మి.లీ. ఒక కేజీ కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. తర్వాత ఎం-45ను 2.5గ్రాము ఒక కేజీ విత్తనానికి కలిపి శుద్ధి చేస్తే రసం పీల్చే పురుగులు, మచ్చ తెగులు సమర్థవంతంగా అరికట్టవచ్చునన్నారు. రాబోయే మూడు నాలుగు రోజులు వర్షం పడే అవకాశం ఉందని, రైతులు విత్తనాలను సిద్ధం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డిప్యూటి డైరెక్టర్ మద్దిలేటి, ఏడీ రవి, టెక్నికల్ వ్యవసాయాధికారి బాలునాయక్, విస్తరణ అధికారులు మురళీకృష్ణ, అలేఖ్య, శిరీష, రైతుభరోసా సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరి

శింగనమల : మండలంలోని చక్రాయపేట గ్రామంలోని స్వర్ణ భూమి ఫెర్టిలైజర్ ఎరువు తయారీ కేంద్రాన్ని జిల్లా వ్యసాయధికారి తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులు, ఎరువులు వివరాలకు తనిఖీ చేశారు. ఆమె వెంట ఏవోలు బాలనాయక్ అన్వేష్ కుమార్ ఉన్నారు.

ఉచిత వాటర్ ప్లాంట్ ప్రారంభం

అనంతపురంరూరల్, జూన్ 27: మండలంలోని రాచానపల్లి పంచాయతీ సిండికేట్ నగర్‌లో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఉచిత మంచినీటి వాటర్ ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ... పరిటాల సునీత ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామానికి వచ్చారని, ఆ సమయంలో గ్రామంలో తాగునీటి సమస్యను ప్రజలు, స్థానిక నాయకులు ఆమె దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. టీడీపీ గెలవగానే గ్రామాలో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి.. సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అందులో భాగంగా వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి.. ఇచ్చిన హామీని నెరవేర్చారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాములరాయి రఘు, ఎంపీటీసీ క్రిష్టారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు మంజునాథ్, యాదవ సాధికార సమితి రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షుడు బిల్లా నాగరాజు, ఎర్రిస్వామి, టీఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షులు బుల్లెట్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న టీడీపీ నాయకులు, తదితరులు

రామోజీరావుకు నివాళి

అనంతపురం అర్బన్: ఈనాడు గ్రూప్స్ అధినేత రామోజీరావు సంస్మరణ సభను గురువారం విజయవాడలోని అనుమోలు గార్డెన్స్‌లో నిర్వహించారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, టీడీపీ రాష్ట్ర నాయకులు కేఎం జకీవుల్లా, టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ ఇందులో పాల్గొని ఆయనకు నివాళులర్పించారు.





సంస్మరణ సభలో ఎమ్మెల్యే దగ్గుపాటి, వెంకటశివుడు యాదవ్, నాయకులు

ఫుడ్ పాయిజన్ కారకులను సస్పెండ్ చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్ : గుత్తి మండలంలోని రజాపురం గ్రామంలో బీ.ఆర్. అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో 40 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, అందుకు కారణమైన ప్రిన్సిపల్, వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఏపీ ఎంఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం అంబేడ్కర్ గురుకులాల జిల్లా కో-ఆర్డినేటర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జెన్నె చిరంజీవి, సుదర్శన్ మాట్లాడుతూ... డీసీఓ ఈ విషయంలో స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో యువసేన జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి చంద్రశేఖర్, రాప్తాడు ఎస్సీ, ఎస్టీ ఫోరం రామాంజి, నాయకులు తూముచెర్ల సాకే నరసింహులు, మీనుగ రామాంజనేయులు, రాప్తాడు నరేష్, మురళీకృష్ణ, గణేష్, రామ్‌చరణ్, రమణయ్య, రాజశేఖర్, రాజు, జైకృష్ణ, ఓబుళపతి పాల్గొన్నారు.

ఉపాధి కల్పించేలా కృషి చేయండి

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 27: కరువు జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నాగార్జునను బలిజ, జనసేన నాయకులు కోరారు. గురువారం స్థానిక ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములు సేకరించి, ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బలిజ, జనసేన నాయకులు పేరూరు శ్రీనివాసులు, వెన్నెల కృష్ణ, గోపాల్, దివాకర్, జనసేన వీరమహిళ మహాలక్ష్మి, విశ్రాంత ఏబీసీడబ్ల్యూఓ రామాంజినేయులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ రూట్ క్లియర్



అడ్డు వేసిన దిమ్మెలను జేసీబీతో తొలగిస్తున్న సిబ్బంది

అనంతపురం క్రైం : టవర్‌క్లాక్ సమీపంలోని ఫ్లైఓవర్ కింద ఏర్పాటు చేసిన అండర్ పాస్‌లో వాహనాల రాకపోకలకు అనుమతి ఇచ్చారు. భారీ వాహనాలు వెళ్లకుండా అడ్డుగా ఐరన్ బార్ ఏర్పాటు చేయడంలో భాగంగా ఆర్అండ్‌బీ ఎన్‌హెచ్ అధికారులు కొంతకాలం రాకపోకలకు బ్రేక్ వేశారు. ఆ ప్రక్రియ పూర్తి కావడంతో గురువారం అడ్డుగా వేసిన దిమ్మెలను తొలగించారు. దీంతో వాహనాల రాకపోకలు సాగాయి.

పరిశుభ్రత చర్యలు

నార్పల, జూన్ 27: మండల కేంద్రంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మేజర్‌గ్రామ పంచాయతీ సర్పంచు సుప్రియ, పంచాయతీ సెక్రటరీ అశ్వర్థనాయుడు గురువారం పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. తాగునీరు ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేశారు. ఉయ్యాలకుంట, జంగాల కాలనీలో డ్రైనేజీ కాలువలలో స్ప్రే చేయించారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

అనంతపురం క్రైం, జూన్ 27 : నగరంలోని పార్కులలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. గురువారం నగరంలోని 37,38 డివిజన్ల పరిధిలో మేయర్ పర్యటించారు. రాంనగర్ పార్కులో పర్యటించి వాటర్ ఫౌంటెన్, లాన్, వాల్ ఆర్ట్ పనులు అదనంగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కమల్ భూషణ్, ఈఈ సూర్యనారాయణ, హార్టికల్చర్ ఏడీ ప్రసన్నలక్ష్మి, ఏఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



రాప్తాడులో ఇటుకపల్లయ్య, పెదయ్యస్వాముల ఊరేగింపు

వైభవంగా స్వాముల ఊరేగింపు

రాప్తాడు, జూన్ 27: రాప్తాడులో ఇటుకపల్లయ్యస్వామి, పెదయ్యస్వాములను గురువారం వైభవంగా ఊరేగించారు. ఎనిమిదేళ్ల తరువాత ఇటుకపల్లయ్యస్వామి, 20 ఏళ్ల తరువాత పెదయ్యస్వామిని రాప్తాడు గ్రామంలోకి తీసుకుని వచ్చి ఊరేగించడంతో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపు కార్యక్రమాన్ని తిలకించడానికి ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో రాప్తాడు వీధులన్ని జనసంద్రంగా మారాయి.

ఎంపీఈఓలను ఆదుకోండి

అనంతపురం అర్బన్, జూన్ 27: వ్యవసాయ శాఖలో కొన్నేళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఎంపీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడిని ఎంపీఈఓల సంఘం నాయకులు కోరారు. గురువారం విజయవాడలోని ఆయన నివాసంలో ఎంపీఈఓల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షుడు రెడ్డి ప్రసాద్, నాయకులు శంకర్, నరేష్ బాబు మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. వైసీపీ పాలనలో సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత కొన్నేళ్లుగా పనిచేస్తున్న ఎంపీఈఓలకు అన్యాయం జరిగిందన్నారు. 1000 హెక్టార్లకు ఒక ఎంపీఈఓను నియమించి న్యాయం చేయాలని కోరారు. చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న అనంత జిల్లాకు చెందిన ఎంపీఈఓలను తిరిగి అనంతలోనే పోస్టింగ్‌లు ఇప్పించాలన్నారు. ఓడీపై వెళ్లకపోవడంతో టర్మినేట్ చేసిన వారికి తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. ఆర్బీకే సిబ్బంది తరహాలోనే సమాన పనికి సమాన వేతనం మంజూరు చేయాలని కోరారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ.. వైసీపీ పాలనలో ఇబ్బందులు పడిన ప్రతి ఎంపీఈఓకు తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి 1000 హెక్టార్లకు ఒక ఎంపీఈఓని నియమించి, అందరికీ తిరిగి సొంత జిల్లాలోనే ఉద్యోగ అవకాశం కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.



మంత్రి అచ్చెన్నాయుడికి సమస్యలు వివరిస్తున్న రెడ్డి ప్రసాద్

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



ఫ్రెషర్స్ డేలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

అనంతపురం రూరల్, జూన్ 27: స్థానిక ఆలమూరు రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయ ఉద్యాన కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, శ్రీ బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లెకిశోర్, విశ్రాంత శాస్త్రవేత్త ప్రొఫెసర్ శివానంద మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఉద్యాన కోర్సులకు మంచి డిమాండ్ ఉందని, రాబోయే రోజుల్లో జిల్లా హార్టికల్చర్ హబ్‌గా మారనుందని ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని అన్నారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్యఅతిథులు బహుమతులు అందజేశారు.

ఉన్నత విద్య కోసం రూ.లక్ష వితరణ



నగదు అందజేస్తున్న రమణారెడ్డి

అనంతపురం కల్చరల్, జూన్ 27: నగరానికి చెందిన దేవాంగ సాగర్ అనే విద్యార్థి ఉన్నత విద్యాభ్యాసం కోసం రూ.లక్ష అందజేసి.. అమ్మ సంస్థ అండగా నిలిచింది. నగరానికి చెందిన ప్రసాద్, లలిత దంపతుల కుమారుడు దేవాంగసాగర్. 2023 - 24 విద్యాసంవత్సరం పదో తరగతిలో 600 మార్కులకు గాను 597 మార్కులు సాధించాడు. ఉత్తమ ఫలితాలు సాధించినందుకుగాను దేవాంగసాగర్‌కు విజయవాడ శ్రీచైతన్య కాలేజీలో 3.5 లక్షల ఫీజులు రూ.1.5 లక్షలు మినహాయించి రూ.2 లక్షలకు ఇంటర్మీడియట్ ఎంపీసీ కోర్సు, ఐజీటీ కోచింగ్‌కు సీటును కేటాయించారు. అయితే దేవాంగసాగర్ తండ్రి చీరల దుకాణంలో సేల్స్‌మెన్. తల్లి ఇళ్లల్లో పాచిపని చేసుకునేది. వీరిది నిరుపేద కుటుంబం కావడం వల్ల రూ.2లక్షల ఫీజును చెల్లించే స్థోమత లేక అమ్మ సంస్థను ఆశ్రయించారు. దీంతో అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి గురువారం ఆ కుటుంబాన్ని కలిసి రూ.లక్ష విరాళం అందజేశారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్స రంలోనూ మరో రూ.లక్ష అందజేస్తామని ఈ సందర్భంగా రమణారెడ్డి హామీ ఇచ్చారు.

హక్కులను పరిరక్షించుకోవాలి

అనంతపురం క్రైం, జూన్ 27: ట్రాన్స్‌జెండర్లు తమకున్న ప్రాథమిక హక్కులను పరిరక్షించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ అన్నారు. గురువారం జిల్లా కోర్టు సముదాయంలోని న్యాయసేవాసదన్‌లో ట్రాన్స్‌జెండర్ల హక్కులపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి వారికున్న హక్కులపై అవగాహన కల్పించారు. ట్రాన్స్‌జెండర్లు, రాజ్యాంగహక్కులు, లీగల్ సర్వీసెస్ అథారిటీస్ చట్టం, న్యాయ సహాయం, ఉచిత న్యాయ సహాయం అంశాలపై వారికి వివరించారు. కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ ఇటికె నల్లప్ప పాల్గొన్నారు.

మూడో అంతస్తు నుంచి పడి మహిళ మృతి

అనంతపురం క్రైం, జూన్ 27: మూడో అంతస్తుపై ఉన్న నీటి ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న ఓ మహిళ ప్రమాదవశాత్తు కింద పడి మరణించింది. అనంతపురం రూరల్ మండలం వీఎస్ఆర్ కాలనీకి చెందిన సుమలత బుధవారం సాయంత్రం మూడో అంతస్తులో ఉన్న ట్యాంక్‌ను శుభ్రం చేయసాగింది. ఆ సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి మూడో అంతస్తు నుంచి కింద పడింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక ఆమె అర్ధరాత్రి మరణించింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని... దర్యాప్తు చేపట్టారు.

కలెక్టర్‌ను కలిసిన డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య

అనంతపురం క్లాక్‌టవర్ : డీఆర్‌డీఏ - వైకేపీ నూతన పీడీ ఈశ్వరయ్య గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్త ప్రభుత్వంలో పెంచిన ఫించన్‌లు జూలై 1వతేదీ నుంచి ఇంటి వద్దనే లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పీడీకి సూచించారు. అందరినీ సమన్వయం చేసుకుని సక్రమంగా పింఛన్లను పంపిణీ చేస్తామని కలెక్టర్‌కు పీడీ వివరించారు.

ఈవీఎంల గోడౌన్ పరిశీలన

అనంతపురం టౌన్ : ఎన్నికల నిర్వహణకు ఉపయోగించి పాత ఆర్డీఓ కార్యాలయం గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను కలెక్టరు వినోద్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఎన్నికల నిబంధనల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదామ్‌ను తెరపించి ఈవీఎంల యంత్రాలు, వాటి భద్రతను పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ మేగస్వరూప్, డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్థల ఆక్రమణలను అడ్డుకోండి: టీడీపీ



ఆర్డీఓ కార్యాలయ ఇన్‌చార్జికి వినతిపత్రాన్ని అందజేస్తున్న టీడీపీ నాయకులు

గుంతకల్లు, జూన్27: నివాస స్థలాలను కొందరు ఆక్రమించుకున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ నాయకులు గుంతకల్లు ఆర్డీవో, తహసీల్దారు, కమిషనరుకు వినతిపత్రాన్ని అందజేశారు. గురువారం మధ్యాహ్నం ఆర్డీవో, తహసీల్దారు, మునిసిపల్ కార్యాలయాలకు వెళ్లిన టీడీపీ నాయకులు ఆక్రమణలను అడ్డుకోవాలని విన్నవించారు. పట్టణంలోని దోనిముక్కల రోడ్డులోనూ, కసాపురం శివారులోనూ ఆక్రమణలు కొనసాగుతున్నాయని, పట్టాలలో పేర్లు మార్చి ఆక్రమిస్తున్నారని తెలిపారు. ఈ రెండు ప్రాంతాల్లో నివాస స్థలాల విషయంగా విచారణ జరిపి, ఖాళీ స్థలాలను గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి, వాల్మీకి సాధికార సమితి జిల్లా కార్యదర్శి తలారి మస్తానప్ప, తెలుగు మహిళా నాయకురాలు లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్ల తొలగింపు



తొలగించిన కంపచెట్లు

పామిడి, జూన్ 27: మండలంలోని రామగిరి ఎగువతండా గ్రామంలో ఇళ్ల మధ్యలో ఏపుగా పెరిగి ప్రమాదకరంగా మారిన కంపచెట్లను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ తన సొంత నిధులతో తొలగింపజేశారు. గ్రామంలో అతిసారతో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించేందుకు వచ్చిన ఆయన్ను కంపచెట్లు తొలగింపజేయాలని స్థానిక ప్రజలు కోరిన విషయం తెలిసిందే. ఆమేరకు కంపచెట్లను తొలగించారు. తాగునీటి సరఫరాకు తగిన చర్యలు చేపడుతున్నట్లు వారు తెలిపారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ



నోటు పుస్తకాలు, పెన్నులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

బొమ్మనహాళ్, జూన్ 27: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కృష్ణాపురం శీన ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ చేశారు. ఎంఈఓ మల్లికార్జున తెలిపిన మేరకు పాఠశాలలో 80 మంది విద్యార్థులు ఉన్నారని ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదివే విద్యార్థులకు గ్రామానికి చెందిన కృష్ణాపురం శీన తన సొంత ఖర్చులతో నోటు పుస్తకాలు, పెన్నులు, ఇతర విద్యావస్తువులను అందించారని తెలిపారు.

పామిడి: పట్టణంలోని టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం ఖల్సా దాబా నిర్వాహకుడు తేజేంద్రనాథ్‌సింగ్ రైటింగ్ ప్యాడ్స్ పెన్నులు వితరణ చేశారు. ఈ వితరణపై విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామ్‌కుమార్, బోధనా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పంపిణీ చేసిన విద్యా సామగ్రిని చూపుతున్న విద్యార్థులు

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ లక్ష్మీప్రసన్న

కళ్యాణదుర్గం రూరల్, జూన్ 27: మండలంలోని పాల్వాయి గ్రామంలో గురువారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని సీడీపీవో లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. నలుగురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేసి అంగన్‌వాడీ కేంద్రంలో పేర్లు నమోదు చేశారు. అంగన్‌వాడీ నుంచి 12 మంది చిన్నారులను ప్రాథమిక పాఠశాలకు పంపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అరుణ, ఏడబ్ల్యూఎస్ లక్ష్మీ, రాధ, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి: ఆర్డీఓ

పామిడి, జూన్ 27: మండలంలోని గ్రామీణ ప్రాంత ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రామగిరి ఎగువతండా గ్రామంలో అతిసారాతో గత కొన్ని రోజుల్లోనే ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం ఆయన ఆ గ్రామంలో పర్యటించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య వైద్య శిబిరంను పరిశీలించారు. గ్రామంలో ఎక్కడా కంపచెట్లు, చెత్తాచెదారం ఉండకుండా తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దోమలు వ్యాపించకుండా ఫాగింగ్ చేయాలని సూచించారు. అనంతరం ప్రజలతో సమావేశమయ్యారు. ప్రజలు తమ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపైన ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అప్పుడే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉంటారన్నారు. తర్వాత పాఠశాలను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో ఏయే పదార్థాలు అందజేస్తున్నారని ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రంను సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. గ్రామంలో రైతులు తమ సమస్యలను ఆర్డీఓ దృష్టికి తీసుకువచ్చారు. పొలాల రస్తా విషయంపై ఉన్న వివాదంను తెలియజేయగా వెంటనే ఆ సమస్యను పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని వీఆర్వో రామాంజనేయులును ఆదేశించారు. ఈఓఆర్డీ శశికళ, పంచాయతీ కార్యదర్శి చంద్రమౌళి గ్రామంలో వీధులన్నింటినీ శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఐసీడీఎస్ సీడీపీఓ డిల్లీశ్వరి, ఎద్దులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్, డాక్టర్ ఉదయార్క్, ఆరోగ్య, రెవెన్యూ, పంచాయతీ రాజ్‌శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రామగిరిలో ప్రజలతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి

డయేరియాపై అవగాహన చర్యలు

గుంతకల్లుటౌన్, జూన్ 27: పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో గురువారం పొదుపు సంఘాల సభ్యులకు డయేరియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మెప్మా సీఎంఎం భవాని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ ఇళ్లలో నీటిని నిల్వ ఉంచరాదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. సమావేశంలో ఆశా వర్కర్లు, మెప్మా సీఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలంలోని మొలకతాళ్ల గ్రామంలో గురువారం ఐసీడీఎస్ సీడీపీఓ సాజిదాబేగం, ఆరోగ్య సిబ్బంది డయేరియాపై గర్భవతులు, చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భోజనం చేసేముందు చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలన్నారు. పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమకాటుకు గురికాకుండా దోమతెరలను వాడాలని సూచించారు. అనంతరం మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దస్తగిరమ్మ, ఏఎన్ఎం నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్త కుమారి పాల్గొన్నారు.



గుమ్మఘట్టలో మాట్లాడుతున్న వైద్యాధికారి బాలాజీనాయక్

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం డయేరియాపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గౌరీదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజినమ్మ, పలువురు ఆరోగ్య కార్యకర్తలు అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరై సమావేశంలో డయేరియాపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ మురళి, వైద్యాధికారి బాలాజీనాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించండి: ఎస్ఐ

పెద్దపప్పూరు, జూన్27: ప్రశాంత వాతావరణంలో ప్రజలు జీవనం సాగించాలని ఎస్ఐ మహమ్మద్‌గౌస్ తెలిపారు. మండలంలోని తిమ్మనచెరువు గ్రామంలో గురువారం గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించమని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

తండ్రి హత్య కేసులో కుమారుడి అరెస్ట్

కూడేరు, జూన్ 27: మండలంలోని కమ్మూరు గ్రామంలో తండ్రి చిన్న ఆంజనేయులును హత్య చేసిన కుమారుడు తిరుపాల్‌ను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. నిందితుడు కమ్మూరు గ్రామ సమీపంలోని స్కంద వెంచర్ వద్ద ఉండగా సమాచారం అందుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచారు.

టీ హోటల్‌లో చోరీ

గుంతకల్లు టౌన్, జూన్ 27: పట్టణంలోని ఎస్ఎల్వీ టాకీస్ రోడ్డులోని ఓ టీ హోటల్‌లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగుడు రాత్రి హోటల్ తాళాలను పగలగొట్టి లోపలికి చొరబడి క్యాష్ బాక్స్‌లో ఉన్న రూ. 5వేలు ఎత్తుకెళ్లారని హోటల్ యజమాని సుధాకర్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చోరీ దృశ్యాలు హోటల్‌లోని సీసీ కెమెరాలో నమోదు అయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో డ్రైవరుకు గాయాలు

గుత్తిరూరల్, జూన్ 27: మండలంలోని ఊబిచెర్ల గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై గురువారం బొలెరో వాహనం బోల్తా పడడంతో బాబు నాయక్ అనే డ్రైవరు తీవ్రంగా గాయపడ్డాడు. పామిడి మండలం పాల్యంతండకు చెందిన బాబు నాయక్ హైదరాబాదు నుంచి పామిడికి బొలెరో వాహనంలో వస్తుండగా ఊబిచెర్ల శివారులో అదుపు తప్పి బోల్తా పడింది. స్థానికులు గుర్తించి క్షతగాత్రుడిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పెంగ్విన్ మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ

తాడిపత్రిటౌన్, జూన్27: నేషనల్ ఏజెన్సీ టెస్ట్, ఐఐటీ అడ్వాన్స్‌డ్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో పెంగ్విన్ మాంటిస్సోరి విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఆ విద్యా సంస్థ కో ఆర్డినేటర్ నాగేంద్ర, ప్రిన్సిపాల్ బుష్రా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ ఏజెన్సీ టెస్ట్‌లో ఆల్‌ఇండియా లెవల్‌లో పీఎం యశస్వి 174వ ర్యాంక్, పూర్వవిద్యార్థి సురేష్ ఐఐటీ అడ్వాన్స్‌డ్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 2193వ ర్యాంక్ సాధించారని వారు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతుకు గాయాలు



గాయపడిన రైతు రాముడు

కణేకల్లు, జూన్ 27: మండల కేంద్రానికి చెందిన రైతు కురుబ రాముడు విద్యుదాఘాతంతో గాయపడ్డాడు. గురువారం ఆయన 7వ కాలువ వద్ద ఉన్న తన పొలంలో మొక్కజొన్న పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను తాకాడు. దీంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అయితే అదే సమయంలో విద్యుత్ సరఫరా బంద్ కావడంతో రాముడు ప్రాణాపాయం నుండి బయటపడ్డాడు. అప్పటికే చేతులకు గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం బళ్లారికి తరలించారు.

పనితీరుకు ప్రశంసలు



ఎస్పీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్ఐ ఆంజనేయులు

కంబదూరు (కళ్యాణదుర్గం), జూన్ 27: ఎన్నికల సమయంలో మండలంలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన కంబదూరు ఎస్ఐ ఆంజనేయులుకు జిల్లా ఎస్పీ గౌతమి శాలి నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. గురువారం అనంతపురం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ పనితీరును ఎస్పీ అభినందించారు.

వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

యాడికి, జూన్27: దోమ జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ సోకకుండా అప్రమత్తత చాలా అవసరమని ప్రభుత్వ వైద్యుడు శ్రీరామ్‌కుమార్ తెలిపారు. గురువారం యాడికిలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మలేరియా, డెంగీ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దోమల ఉధృతిని నివారించడానికి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఇంటిలో కూడా వారంలో ఒకరోజు డ్రైడేగా పాటించాలని తెలిపారు. సదస్సులో మలేరియా నివారణ తాడిపత్రి సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు, పలువురు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు చేపట్టండి

యల్లనూరు, జూన్27: మండలంలోని అన్ని పంచాయతీల్లో దోమల నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వీరరాజు తెలిపారు. దోమలు అధికంగా ఉండడం వల్ల జ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. మండలకేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో ఫాగింగ్ చేయించాలని పంచాయతీ సెక్రటరీలను ఆదేశించారు.

బీటీపీ - రాయదుర్గం ప్రధాన రోడ్డుపై రంధ్రం



గోనబావి దగ్గర రోడ్డుపై పడిన రంధ్రం

గుమ్మఘట్ట, జూన్ 27: మండలకేంద్ర నుంచి రాయదుర్గంకు వెళ్లే ప్రధాన రహదారిపై గోనబావి గ్రామం దగ్గర రంధ్రం పడింది. దీంతో ప్రమాదాలు జరుగుతాయని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. నాలుగేళ్ల కిందట ఈ రోడ్డు నిర్మించారు. రోడ్డుపై రంధ్రం పడటంతో ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. సంబంధి త అధికారులు రహదారిలో ఉన్న రంధ్రాన్ని పూడ్చించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



కొండల్లో సీడ్ బాల్స్ విసురుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కళ్యాణదుర్గం(శెట్టూరు), జూన్ 27: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని మండల విద్యాధికారి శ్రీధర్ అన్నారు. యాటకల్లు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి ఆధ్వర్యంలో మండల విద్యాధికారి శ్రీధర్, ఫారెస్టు అధికారులు, జగన్నాథ్, తిమ్మక్క పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం సీడ్ బాల్స్ తయారు చేసి గ్రామ సమీపంలోని కొండల్లో విసిరివేశారు. పిల్లలకు బాల్యదశ నుంచే పర్యావరణంపై అవగాహన కల్పించాలనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు తెలిపారు. దాదాపు 500 సీడ్ బాల్స్‌ను కొండగుట్టలో వేసినట్లు వెల్లడించారు.

ఉత్తమ పౌరులను అందించే బాధ్యత టీచర్లదే

శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు



ఎమ్మెల్యే కాలవను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

రాయదుర్గం, జూన్ 27: సమాజానికి ఉత్తమ పౌరులను అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు తెలిపారు. గురువారం బాలగంగాధర్‌తిలక్ హైస్కూల్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయడంతో పాటు ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణ ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కాలవ మాట్లాడుతూ సమాజంలో జీవించడానికి విద్య ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాంజినేయులు, టీడీపీ నాయకులు బళె శంకర్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాయదుర్గాన్ని అభివృద్ధి చేస్తా

అన్ని రంగాల్లో రాయదుర్గాన్ని అగ్రగామిగా నిలుపుతానని శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు తెలిపారు. గురువారం కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆయనకు అభినందన సభను ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభకు జయంతి సురేష్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే కాలవను పూలమాలలు, శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సహకరించాలని వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉమామహేశ్వరయ్య, గెల్లి రామరాజు, వెంకటరమేష్ పాల్గొన్నారు.

టీడీపీతోనే ముస్లిం మైనార్టీల అభ్యున్నతి



సమావేశంలో మాట్లాడుతున్న మహమ్మద్ రఫీ

పామిడి, జూన్ 27: తెలుగుదేశం పార్టీతోనే ముస్లిం మైనార్టీల అభ్యున్నతి సాధ్యపడుతుందని ఆ పార్టీ ముస్లిం మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ పేర్కొన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ పాలనతోనే ముస్లిం మైనార్టీలకు రంజాన్ తోఫా, దుల్హాన్ పథకం, హజ్‌యాత్రకు రాయితీలు తదితర ఎన్నో సంక్షేమ ఫలాలు అందాయన్నారు. వైసీపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలను విస్మరించిందన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ దూదేకుల గౌస్‌పీరా, మాజీ కౌన్సిలర్ చెన్నవరం మహబూబ్‌బాషా, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు కొట్టం మాలిక్‌బాషా, బాబా, షేక్షావలి, మహమ్మద్ రఫీ, జిలాన్ పాల్గొన్నారు.

లేగదూడపై చిరుత దాడి

కళ్యాణదుర్గం, జూన్ 27: మున్సిపాల్టీ పరిధిలోని ఒంటిమిద్దె గ్రామంలో గురువారం తెల్లవారుజామున లేగదూడపై చిరుత దాడి చేసి చంపింది. రైతు నాగరాజుకు చెందిన లేగదూడ ఇంటిపక్కనే వ్యవసాయ తోటలో మేతకు వెళ్లగా అక్కడ చిరుత దాడి చేసింది. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

ఘర్షణలో గాయపడిన వ్యక్తి మృతి



ఎరుకలయ్య (ఫైల్)

పుట్లూరు, జూన్27: మండలంలోని కోమటికుంట్ల గ్రామంలో ఈనెల 17న జరిగిన టీడీపీ, వైసీపీ ఘర్షణలో గాయపడిన ఎరుకలయ్య (58) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. ఎన్నికల అనంతరం గ్రామంలో ఇరు పార్టీ వర్గాల మధ్య మాట మాట పెరిగి ఘర్షణ జరిగింది. ఈక్రమంలో ఎరుకలయ్యకు తీవ్రగాయాలు కావడంతో బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. సీఐ సుబ్రహ్మణ్యం గ్రామంలో బందోబస్తు ఏర్పాటుచేశారు.

గురుకుల విద్యార్థులకు పరామర్శ

గుత్తి రూరల్, జూన్ 27: మండంలోని రజాపురం అంబేడ్కర్ బాలికల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన విద్యార్థినులను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు నారాయణ గురువారం పరామర్శించారు. పాఠశాల ఆవరణ, బాతురూంలను, వంటశాలను ఆయన పరిశీలించారు. హస్టల్‌లో అపరిశుభ్రతపై ఏజెన్సీ నిర్వహకుడు హనుమంతురావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి తస్లీం నిత్యావసర సరుకులను పరిశీలించి, శాంపిళ్లను ల్యాబ్‌కు పంపారు. వంటశాలను తనిఖీ చేశారు. సర్పంచు లింగమయ్య, నాయకులు ఏంకే చౌదరి, లక్ష్మణ్, శ్రీనివాసులు, చైల్డ్‌లైన్ జిల్లా కో- ఆర్డినేటర్ వెంకటేశ్వరి, ప్రిన్సిపాల్ ఉషా, బేతాపల్లి వైద్యులు ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

గుత్తి, జూన్ 27: రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన సాగు సాయం రూ.20వేలు ఈ ఖరీఫ్ సీజన్‌లో అందించాలని కోరారు. పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్ పెంచి రైతులకు పంట రుణాలను వడ్డీ లేకుండా రూ. 3లక్షలు, పావలా వడ్డీతో రూ. 5లక్షలు ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి రుణాలను అందించాలని డిమాండ్ చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. వ్యవసాయానికి అవసరమైన ఎద్దుల బండ్లు, పనిముట్ల కొనుగోలుకు 50శాతం సబ్సిడీ అందించాలని కోరారు. కల్తీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటరాముడు, పట్టణ కార్యదర్శి రాజు, నాయకులు నజీర్, షఫీ, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: ప్రభుత్వం రైతులకు అవసరమైన డ్రిప్పు, స్ప్రింక్లర్లు 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని రైతు సంఘం నాయకుడు గోపాల్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం కూడేరులో రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

పెట్టుబడి సాయం అందించాలి

గుంతకల్లుటౌన్: రైతులకు వెంటనే పంట పెట్టుబడి సాయం కింద రూ. 20వేలు ఇవ్వాలని తహసీల్దారు శేషఫణికి గురువారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి పీ రామాంజినేయులు మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి రుణాలు అందించాలన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే జీఓను వెంటనే రద్దు చేయాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వ్యవసాయం కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దేవేంద్ర, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఈశ్వరయ్య, నాయకులు పుల్లయ్య, బాషశీనా, నాగేంద్ర, రంగనాయకులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాడిపత్రిటౌన్: పంటలు నష్టపోయి కష్టాల్లో ఉన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరాముడు, సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్‌లు పేర్కొన్నారు. రైతు సమస్యలపై తహసీల్దార్ ఆంజనేయులుకు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధిహామి పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలన్నారు. వ్యవసాయ పనిముట్లను 50శాతం సబ్సిడీతో అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, ఓబిరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, రమణ, ఉమాగౌడ్, శ్రీరాములు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆదుకోవాలని వినతి

పుట్లూరు: గత ఐదేళ్ల నుంచి పలు రకాలుగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు రామాంజనేయులు గురువారం డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రామాంజనేయులు మాట్లాడుతూ రైతులు పలుమార్లు పంటలు నష్టపోయి ఆర్థికంగా ఇబ్బంది పడ్డారన్నారు. వచ్చిన నూతన ప్రభుత్వం ఆదుకోవాలని వినతిపత్రం అందించారు. రైతు సంఘం నాయకులు సత్తార్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు(గుత్తి)



వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు(పుట్లూరు)

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

గుంతకల్లుటౌన్,జూన్27: పట్టణంలోని రోటరీ పాఠశాలలోని శతాబ్ది ఆడిటోరియంలో గురువారం రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సత్యసాయి జోన్ రోటేరియన్ ఏజీ కే ప్రభాకర్, డిస్ట్రిక్ గవర్నర్ ఎంకే రవీంద్ర హాజరయ్యారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా జీ శివానంద, కార్యదర్శిగా బీ శ్రీనివాసులు, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలిగా అర్చనకార్యా, కార్యదర్శి గా కే సునీత ప్రమాణ స్వీకారం చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్, ఇన్నర్‌వీల్ క్లబ్‌అధ్యక్షురాలు ఎం రేణుకా పాల్గొన్నారు.